క్లుప్తంగా

అటవీశాఖ నిబంధనలు పాటించాలి

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ అటవీశాఖ నిబంధనలు పాటించి, అటవీ సంపదను కాపాడేందుకు అధికారులకు సహకరించాలని ఇంద్రవెల్లి రేంజ్ అధికారి సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడవులను నరకడం, కలప తరలించడం, అడవికి నిప్పు పెట్టడం, వన్యప్రాణుల కోసం ఉచ్చులు బిగించడం చేయరాదన్నారు. నిబంధలను ఉల్లంఘిస్తే అటవీ చట్టం 1967, వన్య ప్రాణుల రక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తలమడుగు: మండల మాల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని శనివారం రాత్రి ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు భూమన్న ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా గుకుంటి క్రాంతి కుమార్ గౌరవ అధ్యక్షుడిగా రాజేశ్వర్, జనరల్ సెక్రెటరీగా గజానంద్, ట్రెజరర్, ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్‌గా రమాకాంత్, దత్తు, జాయింట్ సెక్రెటరీగా రమేష్, నర్సింహులు, రాజశేఖర్, రాకేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రభాకర్, రాజేశ్వర్, పోచన్నను ఎన్నుకున్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: ప్రతీ విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సన్‌షైన్ పాఠశాల కరస్పాండెంట్ శబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం పాఠశాలలో వీడ్కోలు పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు. అప్పుడే తల్లిదండ్రుల కల నెరవేరుతుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిర్వాహకులు సాడిగే రాజగోపాల్, పట్టణ ప్రముఖులు గోపాల్ సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉపాధిహామీ ప్రజావేదిక

తలమడుగు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జాతీయ ఉపాధిహామీ పథకం ప్రజావేదిక గ్రామసభను నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో శేఖర్ తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంలో జరిగిన పనులపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఉపాధిహామీ కూలీలు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

అన్నదానం

కైలాస్‌నగర్: పేదల ఆకలి తీర్చేందుకే సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ట్రస్ట్ నిర్వాహకుడు సుధీర్ కుమార్ సంగెం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, రాజయ్య, అంబయ్య, డిన్ను, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

జవాన్‌కు ఘన స్వాగతం



జవాన్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని పాచ్పెర గ్రామానికి చెందిన మోర నవీన్‌రెడ్డి గత 20 సంవత్సరాలుగా జవాన్‌గా విధులు నిర్వర్తించి, ఇటీవల ఉద్యోగ విరమణ పొంది గ్రామానికి రావడంతో గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా గ్రామస్తులు, స్నేహితులు ఆయనను సత్కరించారు.

మంత్రి సీతక్కను కలిసిన ఆత్రం భాస్కర్

నేరడిగొండ: మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదివారం నేరడిగొండకు రాగా రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఆదిలాబాద్ పార్లమెంట్ ఆశవాహ అభ్యర్థి ఆత్రం భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. మంత్రి బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి వెళ్తుండగా కలిసి తనకు టికెట్ కేటాయించాలని కోరారు.

బరంపూర్‌లో వైద్య శిబిరం

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేర్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రోగులకు ఉచిత డెంటల్ పరీక్ష చేసి, మందులు పంపిణీ చేశారు. గ్రామపెద్దలు కేదరేశ్వర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు రమాకాంత్, రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా పోలియో చుక్కలు

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు



ఇంద్రవెల్లి: పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ



బేల: పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ అక్షిత సతీష్‌పవార్

బోథ్: మండల వ్యాప్తంగా చిన్నారులకు వైద్య సిబ్బంది పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వైద్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. సొనాలలో వైద్యులు నవీన్‌రెడ్డి, ఆర్టీసీ బస్సులో కాంగ్రెస్ నాయకులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

బేల: మండల కేంద్రంతో పాటు సైద్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, చంపెల్లి, మణియార్‌పూర్, సిర్సన్న, అవాల్‌పూర్, సాంగిడి గ్రామాల్లో ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. చంపెల్లిలో మండల జెడ్పీటీసీ అక్షిత సతీష్‌పవార్, మణియార్ పూర్‌లో ఎంపీపీ తాక్రే వనిత గంభీర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యాధికారులు వంశీకృష్ణ, స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ: మండల వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండల కేంద్రంలో ఎంపీడీవో బాల గంగాధర్ చిన్నారులు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఇచ్చోడ: పల్స్ పోలియో విజయవంతమైంది. ఆదివారం మండలంలో 25 కేంద్రాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి సాగర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బ్రహ్మానందం రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: నిండు జీవితానికి రెండు చుక్కలు వేయాలని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమానికి హాజరయ్యారు. వైద్యులతో కలిసి పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యుడు శ్రీకాంత్, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: 0 నుంచి 5 సంవత్సరాలు ఉన్న ప్రతీ చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తాంసి జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో వైద్యాధికారి శ్రావ్యతో కలిసి పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, ఏఎన్ఎం లక్ష్మి, సంపత్ కుమారి, ప్రభావతి పాల్గొన్నారు.

నార్నూర్: పోలియో చుక్కలు చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో చౌహాన్ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, హెచ్ఏ ఈశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఇచ్చోడ: పోలియో చుక్కలు వేస్తున్న వైద్యులు

ఉట్నూర్‌రూరల్: పోలియో రహిత సమాజానికి కృషి చేయాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. ఆదివారం ఉదయం మండల కేంద్రంతో పాటు ఆయాన గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. శ్యాంపూర్‌లో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ చిన్నారులకు చుక్కలు వేశారు. కార్యక్రమాల్లో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో బాలు, వైద్యాధికారులు విజయ్, అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

నేరడిగొండ: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయస్సు గల పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కుమారి గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, మండల కేంద్రంలోని మధుర కాలనీలో సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



నార్నూర్: చుక్కలు వేస్తున్న ఎంపీపీ మోతుబాయి



సిరికొండలో..



తాంసి: పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ రాజు



నేరడిగొండ: కుమారిలో..

భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వం నమోదు

తాంసి: భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదును ఆదివారం మండల కేంద్రంలో చేపట్టారు. కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు సర్పస్ భూమారెడ్డి, కిసాన్ సంఘ్ నాయకులతో కలిసి సభ్యత్వం నమోదు స్వీకరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం భారతీయ కిసాన్ ఎల్లప్పుడు ముందుటుందన్నారు. రైతులు సభ్యత్వం తీసుకోవాలని కోరారు. వారి వెంట మండల అధ్యక్షుడు ఉమాకాంత్ రెడ్డి, కిసాన్ సంఘ్ నాయకులు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకుల చేరిక

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరారు. సిరిచెల్మ ఉప సర్పంచ్ అబ్దుల్ అజీం ఆధ్వర్యంలో వంద మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్‌కి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యేందుకు చేరుతున్నట్లు తెలిపారు.

బీజేపీ టికెట్ 'సోయం'కే ఇవ్వాలి

ఇచ్చోడ: ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ టికెట్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకే ఇవ్వాలని సోయం యూత్ యువసేన జిల్లా అధ్యక్షుడు అక్కెపెల్లి లక్ష్మణ్, జిల్లా నాయకులు బత్తుల అశోక్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం ఇచ్చోడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా సోయం బాపురావు గెలిచిన తర్వాత ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎంతో మంది జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు గెలిచిచారని అన్నారు. కొంత మంది నాయకులు కావాలనే సోయంకు టికెట్ రాకుండా అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అధిష్టానం ఆలోచించి సోయంకు టికెట్ ఇవ్వాలని కోరారు.

తీరనున్న పార్కింగ్ సమస్య!

- వాహనాల పార్కింగ్‌కు గణేష్ థియేటర్ స్థలం
- బల్దియా అధికారుల యోచన
- కౌన్సిల్ ఆమోదం దిశగా ప్రణాళిక



ఖాళీగా ఉన్న గణేష్ థియేటర్ స్థలం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో నెలకొన్న పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం కన్పిస్తోంది. నడిబొడ్డున ఉన్న మున్సిపల్‌కు సంబంధించి విలువైన గణేష్ థియేటర్ స్థలం వాహనాల పార్కింగ్ కోసం కేటాయించేందుకు బల్దియా అధికారులు యోచిస్తున్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం కోసం త్వరలోనే ఎజెండాలో పొందుపర్చేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. కౌన్సిల్ ఆమోదం లభించిన వెంటనే వాహనాలను పార్కింగ్ చేసేందుకు వీలుగా ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టేలా ముందుకు సాగుతున్నారు.

ఏడాది నుంచి ఖాళీగా..

ఆదిలాబాద్ బల్దియాకు సంబంధించిన కోట్లాది రూపాయల విలువైన లీజు స్థలాల్లో గణేష్ థియేటర్ స్థలం ఒకటి. స్థానిక సినిమా రోడ్‌లో గల ఈ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తులు అందులో థియేటర్‌ను నిర్మించి నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రోడ్డును ఆనుకుని ఉండడంతో ఇరవైకి పైగా వ్యాపార మడిగెలును నిర్మించి అద్దెకిచ్చారు. అయితే మున్సిపల్ లీజు గడువు ముగియడంతో 2022 నవంబర్ 5, 6వ తేదీల్లో బల్దియా అధికారులు థియేటర్ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో నిర్మించిన థియేటర్‌తో పాటు వ్యాపార మడిగెలను సైతం కూల్చివేశారు. దీంతో కోట్లాది రూపాయల విలువైన స్థలం గత ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. స్థలం కబ్జాకు గురి కాకుండా ఉండేలా బల్దియా అధికారులు చుట్టూ రేకులతో గట్టి పెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు.

కేటాయింపుపై సర్వత్రా చర్చ

థియేటర్ కూల్చివేసిన ప్రాంతానికి భారీ డిమాండ్ ఉండడంతో ఆ స్థలాన్ని వ్యాపారాల కోసం తిరిగి లీజుకు ఇస్తారా? లేక వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తారా? అనేదానిపై పట్టణ ప్రజానీకంతో పాటు వ్యాపారవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. పట్టణ మధ్యలో స్థలం ఉన్నందున దాన్ని లీజుకు తీసుకునేందుకు పలువురు వ్యాపారులతో పాటు రాజకీయ నాయకులు ప్రయత్నించారు. కానీ బల్దియా అధికారులు ఆ స్థలాన్ని ఎవరికి లీజుకు ఇవ్వలేదు. ఖాళీగా ఉండటంతో ఆ ప్రాంతాన్ని పార్కింగ్ కోసం ఉపయోగిస్తే పట్టణానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉంటారనే అభిప్రాయాన్ని వివిధ పార్టీల నాయకులు వ్యక్తం చేశారు. ఇటీవల ఎమ్మెల్యే పాయల్ శంకర్ సైతం ఆ స్థలాన్ని వ్యాపారాలకు ఇవ్వకుండా పార్కింగ్ కోసం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే మున్సిపల్ అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. కౌన్సిల్ ఆమోదం పొందాక అధికారికంగా ప్రకటించే అవకాశంఉంది.

పార్కింగ్ జోన్ ఏర్పాటు చేస్తాం

పట్టణంలోని అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, సినిమా రోడ్ వంటి ప్రధాన వ్యాపార ప్రాంతాల్లో వివిధ పనులు కోసం వచ్చిన ప్రజలు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగడంతో పాటు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులను దూరం చేసేలా గణేష్ థియేటర్ స్థలాన్ని పార్కింగ్ జోన్‌గా ఏర్పాటు చేస్తున్నాం

– తిరుపతి, మున్సిపల్ డీఈ

సుగుణక్కకు ఎంపీ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ బిడ్డ ఆత్రం సుగుణక్క అందించిన సేవలను కాంగ్రెస్ అధిష్టానం గుర్తించి ఎంపీ టికెట్ ఇవ్వాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత 25 సంవత్సరాల నుంచి సామాజిక సేవలో ఉంటూ బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అందించిన సేవలను గుర్తించి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు లహుదాస్ సావంత్, గాయక్‌వాడ్ రాందాస్, ఆచార్య దత్త, వాగ్మారే పుండలిక్, గాయక్‌వాడ్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

చీరలే శ్రీరామ రక్ష



రైతులు అడవి జంతువుల నుంచి తమ పంటలను రక్షించుకునేందుకు చీరలను నమ్ముకున్నారు. సిరికొండ మండలంలోని వాయిపేట గ్రామ శివారులో పంటల చుట్టూ చీరలను ఏర్పాటు చేసుకున్నారు. ఇలా చేస్తే తమ పంటల్లోకి జంతువులు రావడం లేదని రైతులు చెబుతున్నారు.

– సిరికొండ

జాతీయస్థాయిలో రాణించాలి

కైలాస్‌నగర్: జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్-14 క్రికెట్ టోర్నీలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైన ఇషాంత్‌రెడ్డి, ఓం కిరాజ్‌రెడ్డిలను అభినందించారు. ఆదివారం వారిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్‌లో రాంచిలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పాల్గొనడం గర్వకారణమన్నారు. ఆలిండియా స్థాయిలో సైతం రాణించాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ దయానంద్‌రెడ్డి, నరోత్తంరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: జిల్లా సమస్యలు పరిష్కరించి ఉపాధి, అవకాశాలు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుడు శ్రీరామోజు ఆంజనేయులు డిమాండ్ చేశారు. మోదీ పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద సమస్యలతో కూడిన ప్లెక్సీని ప్రదర్శించాడు. ఆదిలాబాద్ జిల్లా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్, సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరనకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

రూరల్ సీఐ బదిలీ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ సీఐ సైదరావు బదిలీ అయ్యారు. మహబూబాద్ పీసీఆర్‌బీలో పని చేస్తున్న ఫణిందర్ ఇక్కడికి బదీలపై వచ్చారు. సైదరావును మల్టీజోన్ ఐజీకి రిపోర్టు చేయాలని మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే మోదీ పర్యటన

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్
- నల్ల జెండాలతో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్

కైలాస్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే జిల్లా కేంద్రానికి వస్తున్నారని, ఆదిలాబాద్ అభివృద్ధి కోసం కాదని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నల్ల జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఐ పరిశ్రమ, యువత ఉద్యోగాలు, టెక్స్‌టైల్ పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీతో పాటు ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రయ పనులపై ప్రధాని దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సమయంలోనే ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్నారని మండిపడ్డారు. దీనిని నిరసిస్తూ అఖిల పక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు.

విద్యుత్ బిల్లుపై అసంతృప్తికి చెందొద్దు

కైలాస్‌నగర్: ఉచిత విద్యుత్ బిల్లుపై ఎవరూ అసంతృప్తి చెందొద్దని, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గృహజ్యోతి పథకానికి సంబంధించి జీరో బిల్లులను పట్టణంలోని పలు వార్డుల్లో ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. జీరో బిల్లు రానివారు అసంతృప్తి చెందవద్దని, ప్రతిఒక్కరూ గృహజ్యోతి రశీదుతో పాటు ఆధార్, రేషన్‌కార్డు జతచేసి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే

ఇచ్చోడ: ప్రధాని నరేంద్రమోదీ రాజకీయ ప్రయోజనాల కోసమే జిల్లా పర్యటనకు వస్తున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ద్వారా ఆదిలాబాద్ జిల్లాకు చేసిందేమి లేదన్నారు. ఎన్నికల ముందు పర్యటనల పేరుతో బీజేపీ డ్రామా చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రత్నపురం రమేశ్, మెస్రం జంగుబాపు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులుగా పాఠశాలకు తాళం



పాఠశాలకు వేసిన తాళం

- ప్రసూతి సెలవుల్లో ఉపాధ్యాయురాలు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని అధికారులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనంచేందుకు ప్రభుత్వ కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా.. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో గిరిజన విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగానే మారింది. కొంతమంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించక పోవడంతో ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో విద్య కుంటుపడుతోంది. గాదిగూడ మండలంలోని కునికాసా గ్రామపంచాయతీ పరిధిలోని కునికాసా కొలాంగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గత మూడు నెలల నుంచి తెరుచుకోవడం లేదు. దీంతో దాదాపు 20 మంది కొలాం గిరిజన విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు ప్రియమణి ప్రసూతి సెలవుపై వెళ్లడంతో పాఠశాలకు తాళం పడింది. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఏకోపాధ్యాయ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లితే విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పాఠశాలలపై పర్యవేక్షణ కరువైందని గిరిజన సంఘాల నాయకులు వా పోతున్నారు. ఈ విషయమై ఎంఈవో రాపల్లి ఆశన్నను వివరణ కోరగా ఉపాధ్యాయురాలు ప్రసూతి సెలవుపై వెళ్లిందని సమాధానం ఇచ్చారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు.